క్లుప్తంగా

వైద్య రంగానికి ప్రాధాన్యం

ఉయ్యూరు: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. ఉయ్యూరు సచివాలయం పరిధిలోని శ్రీలంక కాలనీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం చైర్మన్ ప్రారంభించారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు గోపీచంద్, చరిత్ర, సమీనా, చంద్రశేఖర్, ఆప్తాలమిక్ అధికారి రాజేష్‌కుమార్ రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్ గోన మదన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: కానూరులో యువత అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు తులసీనగర్‌కు చెందిన మైనాపల్లి మేరీకి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె మౌనిక(26) గతంలో ఏఎన్‌ఎంగా పని చేసి ఇంటి వద్దనే ఉంటుంది. కాగా గత నెల 30న తల్లి మేరీ చర్చికి వెళ్లిన సమయంలో మౌనిక ఇంటి వద్దే ఉంది. తల్లి రాత్రి 10 గంటలకు ఇంటికి రాగా కుమార్తె ఇంట్లో కనిపించలేదు. ఫ్రెండ్ పెళ్లికి వెళ్లానని ఆమె తల్లి ఫోన్‌కు మరోసటి రోజు మెసేజ్ చేసింది. ఆ తరువాత ఆమె ఫోన్ స్విచ్చాఫ్ అయింది. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ప్రారంభం

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఎంపీపీ అనగాని రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలకు హాజరైన క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన టీ షర్ట్‌లు, క్యాప్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో క్రికెట్, కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని లక్ష్మీనరసింహారావు, గుటాల భాగ్యరాజు, ఎంపీడీవో ఈ.సత్యకుమార్, ఎంఈవో కె.రవికుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.
ఉంగుటూరు: ఉంగుటూరులో జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఆటల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయి కబడ్డీ టీమ్ విన్నర్‌గా ఆత్కూరు, రన్నర్‌గా పొట్టిపాడు, ఖోఖో విన్నర్‌గా ఉంగుటూరు, రన్నర్‌గా మానికొండ టీమ్‌లు నిలిచాయని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. గురువారం వాలీబాల్ ఫైనల్ పోటీలు జరుగుతాయి.
పెనమలూరు: పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో షటిల్ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహించనున్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోటీలు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభించారు. క్రికెట్ పురుషులు 19 జట్లు, మహిళలు 2 జట్లు, షటిల్‌లో పురుషులు 19 జట్లు, మహిళలు 19 జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్ 11 జట్లు, ఖో ఖో 10 జట్లు, కబడ్డీ పురుషులు 15 జట్లు, మహిళలు 9 జట్లు నమోదు చేసుకున్నాయి. మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి ప్రారంభించారు.
ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, కౌన్సిలర్ గోన మదన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీవో విమాదేవి పాల్గొన్నారు.
నున్న(విజయవాడరూరల్): మండలంలోని 32 సచివాలయాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడంతో జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ పండుగ వాతావరణాన్ని సంతరించకుంది. పోటీలను ఎంపీపీ ప్రసన్నకుమారి, ఎంపీడీవో భార్గవి పరిశీలించారు. వివిధ క్రీడా పోటీలు జరిగాయి. ఈ నెల 21వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయి. పీడీ టి.వి.వర్మ, టీచర్లు, సచివాలయాల సిబ్బంది పర్యవేక్షించారు.


గన్నవరంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రవి, నాయకులు


పెనమలూరులో పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ వల్లభనేని నాని

యనమలకుదురు వంతెన పరిశీలన

పెనమలూరు: యనమలకుదురులో వంతెనను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి బుధవారం పరిశీలించారు. గత టీడీపీ హయాంలో యనమలకుదురులో బందరు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్‌కు టీడీపీ ప్రభుత్వం బిల్లు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లాడు. దీంతో వంతెన అప్రోచ్ పనులు నిలిచిపోయాయి. దీంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే వంతెనపై రాకపోకలకు పరిస్థితులు అనుకూలించే విధంగా అప్రోచ్‌కు రబ్బిష్ వేశారు. వంతెన పరిస్థితులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాయకులు యార్లగడ్డ నాగబాబు, వీరబాబు, బబ్లూ, ఫణి పాల్గొన్నారు.


వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

వైభవంగా సంక్రాంతి సంబరాలు

ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీ కాలేజీలో తెలుగుశాఖ, సాంస్కృతిక విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా బొమ్మల కొలువు, భోగి మంటలు, పాల పొంగలి, కోలాటం, హరిదాసు ప్రదర్శన, సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి నూకల సాంబశివరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీరాము, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, డెరెక్టర్ వినయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.
హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక విజయవాడ రోడ్డులోని కాకాని భవనం ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు పంపిణీ చేశారు.


ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కాలేజీలో సంబరాలు

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పెనమలూరు: రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పొందాలని సిద్దార్థ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వేల్పూరి అభిషేక్ అన్నారు. కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సెంట్రల్, రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ రాయల్ సిటీ బెజవాడ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాలను డాక్టర్ అభిషేక్ వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, రోటరీ సభ్యులు మౌనిక, ప్రభుకల్యాణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నున్నలో మైక్రోఫిల్టర్ బెడ్స్ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మైక్రోఫిల్టర్ బెడ్స్‌ను, వాకింగ్ ట్రాక్‌ను ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, సర్పంచ్ కాటూరి సరళ బుధవారం ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి జీటీపీ రమణ, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, నాయకులు కొమ్మా కోటేశ్వరరావు, యర్కారెడ్డి నాగిరెడ్డి, జీతం శ్రీనివాసరావు, భీమవరపు శివరామిరెడ్డి, పోలారెడ్డి చంద్రారెడ్డి, భీమవరపు ముత్తారెడ్డి, ఎంపీటీసీ బొంతు సరోజినీ, సాదం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

గన్నవరంరూరల్: పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యమని జిల్లా డైరెక్టర్ పాలడుగు నాని అన్నారు. మండలంలోని సూరంపల్లి పాలకేంద్రం పరిధిలో ఇటీవల మరణించిన పాడి రైతు పి.సూర్యనారాయణకు క్షీరబంధు పథకం ద్వారా మంజూరైన రూ.50 వేల చెక్కును ఆయన బుధవారం సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. పాల కేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు, మేనేజర్ కె.ప్రసాద్, సూపర్‌వైజర్ ఎం.అనిల్‌కుమార్, వేతన కార్యదర్శి చిట్టినేని జోజిబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు**



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయంలో 9 హుండీలు ఉన్నాయి. గతేడాది జులై 27వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 10వ తేదీ వరకు స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. మొత్తం రూ.13,73,258, ఆస్ట్రేలియా డాలర్స్ 100, యూఎస్ డాలర్స్ 26, బంగారం 3 గ్రాములు, వెండి 40 గ్రాములను భక్తులు కానుకలుగా సమర్పించారు. లెక్కింపులో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి కేవీ అనురాధ, సప్తగిరి బ్యాంక్ సిబ్బంది, అర్చకులు, శ్రీదుర్గాశివసాయి సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారని ఈవో ఎం.గంగాధరరావు తెలిపారు.

- **హుండీ ఆదాయం రూ.9.85 లక్షలు**

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.9.85 లక్షలు వచ్చినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం కార్యాలయం ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను బుధవారం లెక్కించారు. గత 69 రోజులకు గానూ రూ.9,85,505 వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

- **కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు**

ఉంగుటూరు: క్రీస్తునందు విశ్వాసం ఉంచువారు నిత్య ఆనందం పొందుతారని జక్కంపూడి విచారణ ఫాదర్ నాగిపోగు జయరాజు అన్నారు. పెద అవుటపల్లిలో కతోలిక పుణ్యక్షేత్రమైన తంబి పుణ్యక్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్థంతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు బుధవారం ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఫాదర్లు దివ్య పూజాబలిని సమర్పించారు. యువతీ యువకులు విద్యార్థుల గురించి ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. పొట్టిపాడు సంఘస్తులు స్తుతిగీతాలతో కొనియాడారు. పూజానంతరం పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ ప్రధాన యాజకులు ఫాదర్ జయరాజుకి కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు. ఫాదర్లు అభిలాష్ గోపు, ప్రవీణ్ గోపు, జయప్రసాద్, రవి, కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా దనుర్మాసోత్సవాలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం కూడారై పాశురం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణస్వామి, శ్రీగోదాదేవి అమ్మ వార్లకు 108 వెండి గిన్నెల్లో పాయసం నివేదించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అభివృద్ధి పథంలో గన్నవరం ప్రాంతం

గన్నవరం: విజయవాడకు అతి సమీపంలో ఉన్న గన్నవరం ప్రాంతం విద్య, వైద్యం, వ్యాపార, పారిశ్రామిక రంగాల పరంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీనికి తోడు గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా లభించడంతో ఈ ప్రాంతానికి మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఒకప్పుడు వ్యవసాయ ఆధారితమైన ఈ ప్రాంతంలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, కేసరపల్లి వద్ద ఐటీ పార్కు, చిన్నఆవుటపల్లి వల్ల పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఏర్పాటుతో ఆధునికత సంతరించుకుంది. దేశీయ ఐటీ దిగ్గజమైన హెచ్‌సీఎల్ సంస్థ కూడా గన్నవరం సమీపంలో క్యాంప్‌ను ప్రారంభించింది. ముఖ్యంగా విద్య, వైద్య రంగంలోనూ ఈ ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకుంది. గన్నవరం ప్రాంతంలో సుమారు 25కు పైగా ఆస్పత్రులను ఏర్పాటు చేసి ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నారు. విద్య పరంగా వి.ఎస్.సెయింట్‌జాన్స్ హైస్కూల్‌తో పాటు అనేక కార్పొరేట్ స్కూల్స్, కళాశాలలను ఏర్పాటు చేశారు. వ్యాపార పరంగా సూపర్ మార్కెట్‌లు, హోల్‌సేల్ దుకాణాలు, ఎలక్ట్రానిక్స్ షాపులు, టూ వీలర్స్ షోరూమ్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. త్రీ స్టార్ హోటల్స్, హోటల్స్, రెస్టారెంట్లు విస్తరిస్తున్నాయి. రానున్న కాలంలో మరింత పట్టణీకరణను సంతరించుకునే దిశగా గన్నవరం ప్రాంతం అడుగులు వేస్తుంది.

అందుబాటులో ప్రత్యేక వైద్య సేవలు..



వైద్య పరంగా ఈ ప్రాంతం వేగంగా వృద్ధి చెందుతుంది. గతంలో పోల్చితే అన్ని రకాల వైద్య సేవలు, ఆస్పత్రులు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుకే కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా పని చేస్తున్నాం.

– డాక్టర్ సూరెడ్డి అరవింద్, గన్నవరం

హోల్‌సేల్ ధరలకే..



హోటల్స్, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు, గృహ నిర్మాణం విస్తరిస్తున్నాయి. అందుకు తగ్గట్లుగానే విజయవాడ ధరలకే అన్ని రకాల పచారీ సరకులను ఇక్కడ హోల్‌సేల్, రిటైల్‌కు అందుబాటులో తీసుకువచ్చాం. అన్ని రకాల వస్తువులు గన్నవరంలోనే లభిస్తున్నాయి.

– గోపిశెట్టి వీరాస్వామి, గన్నవరం

కార్పొరేట్ వైద్య సేవలు..



వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎమర్జెన్సీ, 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి ఉన్నాయి. కంటి వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక వైద్య సేవలందిస్తున్నాం.

– డాక్టర్ దుగ్గిరాల వరుణ్, గన్నవరం











భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం మాసశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకాలు, అనంతరం స్వామివార్ల ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివార్లను పల్లకీలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. శివసాధంలో స్వామివార్లకు శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



